క్లుప్తంగా

ఆత్మీయ వీడ్కోలు



బదిలీ అయిన పోలీసులను సన్మానిస్తున్న ఎస్‌ఐ రవీంద్ర, సర్పంచులు, నేతలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న 8 మంది పోలీసులకు ఆదివారం సన్మాన సభ నిర్వహించారు. ఎస్‌ఐ రవీంద్ర, సర్పంచులు రమేష్, బాబూరావు, త్రినాథ్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, ఏఎస్‌ఐలు తిరుపతిరావు, లక్ష్మణరావు, సీపీఎం నేత శ్రీను, వర్తక సంఘం అధ్యక్షుడు ప్రసన్నకుమార్‌లు ఆయా పోలీసులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారి సేవలను పలువురు కొనియాడారు. నేతలు పులిరాజు, తిరుపతి, దేవ, పోలీసులు సిబ్బంది, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు శంకుస్థాపన

మారేడుమిల్లి : కుండాడ పంచాయతీ పరిధిలోని మల్లిసాల గ్రామంలో జీజేఎంఎ నిధుల్లో భాగంగా రూ. 24 లక్షల వ్యయంతో బోరు, వాటర్ ట్యాంకు పైపులైన్ పనులకు ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీ బాబు, మండల పార్టీ కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ర్యాలీ

పాడేరు రూరల్ : దేశంలోని ఐదు రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై పాడేరులో ఆదివారం సాయంత్రం స్థానిక నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని ఇందుకు మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడమే నిదర్శనమన్నారు. పార్టీ నేతలు రవికుమార్, భాస్కర్, కన్నాపాత్రుడు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

పాడేరు రూరల్ : గిరిజన గ్రామాల్లో అసాంఘిక కార్యకలపాలకు తావులేకుండా ప్రజలకు స్థానిక ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని పాడేరు సిఐ సుధాకర్ సూచించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ఆదివారం తన కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిషేధిత సారా, గంజాయి సాగు, తయారీ, అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. రానున్న ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాలన్నారు. ఎస్‌ఐ రంజిత్, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.రాంబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బసవన్నదొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇరుముడుల స్వీకరణ

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో ఆదివారం సత్య దీక్షలు చేపట్టిన మాలధారుల ఇరుముడుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఏజెన్సీలోని 11 మండలాల నుంచి 500 మంది మాలధారులు వచ్చి పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు ఇరుముడులు సమర్పించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారులు ఇరుముడులను నెత్తిన ధరించిన వాహనాల్లో అన్నవరం రమా సత్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి తరలివెళ్లారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో ఆదివా రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీట్ కం మెరిట్ స్కాలర్‌షిప్) అర్హత పరీక్ష నిర్వహించారు.ఈ పరీక్షకు చింతపల్లి,గూడెంకొత్తవీధి,కొయ్యూరు మండలాల్లోని విద్యార్థులు మొత్తం 84 మంది హాజరైనట్లు ,నలుగురు గైర్హాజరైనట్లు అధికారి పండన్న తెలిపారు.ఎంఈవో ప్రసాద్,చీఫ్ వీరభద్రరావు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని వెలసిన నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పంటలు బాగా పండాలని, ప్రజలంతా అష్టైశ్వరాలతో తలతూగాలని వేడుకొని అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భారీ అన్నసమారాధన జరిగింది.

రైతన్నకు అండగా ఆర్‌బీకేలు

నాడు సాగు కోసం రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. ఎరువులు, విత్తనాల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విస్మరించింది. దీంతో రైతులు పంట వేసుకునేందుకు సర్కారు నుంచి ఎటువంటి సాయం అందక అప్పులు చేసేవారు. నానా అవస్థలు ఎదుర్కొన్నారు. అదంతా గతం.. నాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయాన్ని పండగగా మార్చారు. ప్రభుత్వం రైతన్నకు విత్తు నుంచి పంట కొనుగోలు వరకు అండగా నిలుస్తోంది. దీంతో అన్నదాత ఆనందానికి అవధుల్లేవు.

- రాయితీపై విత్తనాలు, ఎరువులు, యంత్రాలు
- ఆనందంలో గిరిజన రైతులు



కొత్తాడ రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు (ఫైల్)



ప్రారంభానికి సిద్ధంగా మోహనాపురం రైతు భరోసా కేంద్ర భవనం



మండలం : గంగవరం	
పంచాయతీలు	17
గ్రామాలు	60
ఆర్‌బీకేలు	10
అందుబాటులో ఉన్నవి	4
రైతుల సంఖ్య	2044
ఈ క్రాప్ నమోదైన రైతులు	2044
వరి విత్తనాల పంపిణీ	1,250 క్వింటాళ్లు
ఎరువుల పంపిణీ	150 ఎంటీఎస్
ఒక్కో ఆర్‌బీకే నిర్మాణానికి అంచనా విలువ	రూ.21.8 లక్షలు
ఆర్బీకేల నిర్మాణానికి ప్రభుత్వ సాయం	రూ.2.61 కోట్లు
సాగు విస్తీర్ణం	10 వేల ఎకరాలు
వరి	3,500 వేల ఎకరాలు
ఉద్యానవన పంటలు	6,500 వేలు
వరి సాగు రైతులు	475 మంది

గంగవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో రైతు సంక్షేమం ఒకటి. గిరిజన రైతులకు భరోసాగా రైతు భరోసా కేంద్రాలు నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు బహుళ ప్రయోజన కేంద్రాలుగా మారాయి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందిస్తున్నారు. వ్యవసాయాధికారులు అన్నదాతలకు అందుబాటులో ఉంటూ సాగులో చేపట్టాల్సిన సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. వ్యవసాయంలో మరింత విజ్ఞానాన్ని పెంచేందుకు రైతు భరోసా కేంద్రాలు దోహదపడుతున్నాయి. దీంతో రైతులు వ్యవసాయం సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఆర్‌బీకేలు అన్నదాతలకు భరోసాగా నిలుస్తున్నాయి. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలను ప్రభుత్వం అందిస్తుండడంతో గిరిజన రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సేవలిలీ

➡ మండలంలో పది గ్రామ సచివాలయాల పరిధిలో మోహనాపురం, జడేరు, కొత్తాడ, భయ్యనపల్లి గ్రామాల్లో నాలుగు చోట్ల రైతు భరోసా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. నాలుగు రైతు భరోసా కేంద్రాలు ద్వారా గిరిజన, గిరిజనేతర రైతులుకు విశేషమైన సేవలుందుతున్నాయి.

➡ గతంలో ఎరువుల, విత్తనాలు కావాలంటే గోకవరం, కొత్తపల్లి, రంపచోడవరం, అడ్డతీగల, ఏలేశ్వరం వంటి దూర ప్రాంతాలకు రైతులు శ్రమతో వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యానవన, పట్టు సహాయకులు అందుబాటులోనే ఉంటూ రైతులకు కావలసిన అన్నిరకాల సేవలు అందిస్తున్నారు.

➡ ప్రతినెల మొదటి శుక్రవారం ఆర్‌బీకేల్లో రైతులతో గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహించి రైతులకు అవసరమైన సమాచారాన్ని, రైతు సమస్యలను చర్చిస్తున్నారు. సమస్యలను ఉన్నతాధికారులకు నివేదికను వ్యవసాయ సహాయకులు సమర్పిస్తున్నారు. దీంతో రైతుల సమస్యలు సత్వర పరిష్కారానికి ఈ సమావేశాలు దోహదపడుతున్నాయి.

రైతులకు అందిన లబ్ధి

➡ మండలంలో వైఎస్సార్ రైతు భరోసా పథకంలో ఈ ఏడాది 4,614మంది రైతులకు రూ.1,91,68,114 అందింది. ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన రైతు భరోసా సాయం రూ.6,13,00,200లు

➡ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 432 మంది రైతుల నుంచి 29,013 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసింది. గిట్టుబాటు ధర క్వింటా 100 కిలోల రూ.2,183/- గ్రేడ్-ఏ రూ.2,203 కల్పించింది.

➡ గత ఏడాది సాధారణ రకం రూ.2040కి కొనుగోలు చేయగా ఈ ఏడాది రూ.2,183 ఉంది.

➡ విత్తనాలు ఈ ఏడాది వరి 1250 క్వింటాళ్లు 1435 మంది రైతులకు పంపిణీ చేశారు. అలాగే రాగి విత్తనాలు 40 మంది రైతులకు రెండు క్వింటాళ్లు, కందులు 44 మంది రైతులకు రెండు క్వింటాళ్లు పంపిణీ జరిగింది.

➡ నాలుగేళ్లు బ్యాటరీ స్ప్రేయిర్లు 260 మందికి 260 స్ప్రేయర్లు 90శాతం సబ్సిడిపై ఇచ్చారు.

➡ వరి నూర్పిడి యంత్రాలు మూడు , రోటోవేటర్ (దుక్కు దున్నే యంత్రం) ఒకటి కస్టమర్ హైరింగ్ సెంటర్లుకు ద్వారా అందించిండం జరిగింది .

➡ వరి నూర్పిడు యంత్రం ధర రూ 265,000 కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ. 80వేలు పోగా మిగిలిన సొమ్ము 185వేలు గ్రూప్‌లకు బ్యాంక్ లింకేజీ ద్వారా వాయిదా పద్ధతి చెల్లించ రుణ సౌకర్యం కల్పించడం జరిగింది.

➡ ఆర్‌బీకే ద్వారా ఎరువులు ఈ ఏడాది 95 మెట్రిక్ టన్నులు యూరియా సబ్సిడీ ద్వారా రైతులకు ఇవ్వడం జరిగింది. రెండు వందల మంది రైతులకు ఇచ్చారు.



పొలంబడి నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)



కొనుగోలు చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీ సావిత్రి, వ్యవసాయ సహాయకులు కామేష్(ఫైల్)



కొత్తాడ ఆర్‌బీకేలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న సిబ్బంది

ఆర్‌బీకేలతో మేలు



మండలంలో గిరిజన రైతులకు ఆర్‌బీకేలు ఎంతో దోహదపడుతున్నాయి. ప్రభుత్వపరంగా వ్యవసాయశాఖ ద్వారా అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నాం. మండలంలో పదిచోట్ల రైతు భరోసా కేంద్రాలకు భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే రైతులకు మరింత సేవలు అందుబాటులోకి వస్తాయి. ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– కె.విశ్వనాథం, మండల వ్యసాయాధికారి, గంగవరం

ఆనందంగా ఉంది



నేను పండించిన ధాన్యాన్ని మాకు సమీపంలోని గంగవరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. అమ్మిన ధాన్యానికి ప్రభుత్వం మంచి గిట్టుబాటు ధర ఇచ్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో 35 క్వింటాల వరకు అమ్మడం జరిగింది. 25 రోజుల్లో నా బ్యాంక్ ఖాతాలో సొమ్ము జమ చేసింది. ప్రభుత్వం అందిస్తున్న సేవలతో ఆనందం ఉంది.

– మడకం రాజనన్న దొర, గిరిజన రైతు, ఆముదాలబంద గ్రామం

సాగు ఖర్చులు తగ్గాయి



నాకు 2 ఎకరాల పొలం ఉంది. అందులో వరిసాగు చేస్తుంటాను. గతంలో సాగు ఖర్చు ఎక్కువ ఉండేది. పొలంబడి కార్యక్రమంలో పాల్గొనడంతో వ్యవసాయశాఖ అధికారుల సూచనలతో సాగు ఖర్చులు తగ్గించుకోగలిగాను.

– మామిడి చంద్రమ్మ, మహిళారైతు, జడేరు

తక్షణమే సాయం



ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పొందాను. ప్రభుత్వం పంటను కొనుగోలు చేయడంతో దళారుల చేతిలో మోసపోకుండా చాలా సంతోషంగా ఉంది. రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటున్నారు. వ్యవసాయ సాగులో ఇబ్బందులు సస్యరక్షణ సంబంధించి తక్షణమే సాయం అందిస్తున్నారు.

– చవలం సత్యనారాయణదొర , గిరిజన రైతు, రాజంపాలెం గ్రామం

స్వర్ణోత్సవాల నిర్వహణకు విరాళం




విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ పాఠశాలలో స్వర్ణోత్సవాల నిర్వహణ కోసం పాఠశాల పూర్వ విద్యార్థులు (2013–14) టెన్త్ బ్యాచ్ మొదటి విడతగా రూ.29వేలు అందజేశారు. ఈ మేరకు ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగిన సన్నాహక సమావేశంలో కమిటీ సభ్యులకు ఆయా నగదును అందజేశారు. కాగా స్వర్ణోత్సవాల నిర్వహణకు ఇప్పటి వరకు విద్యార్థుల నుంచి సుమారు రూ. 16 లక్షల వరకు నిధులు సమకూరినట్టు కమిటీ కోశాధికారి కృష్ణవర్మ తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో జరగనున్న పాఠశాల స్వర్ణోత్సవాలకు ఈ పాఠశాలలో 1966 నుంచి ఈ ఏడాది వరకు చదువుకున్న విద్యార్థులందరు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పూర్వ విద్యార్థులు శివరామచంద్రరాజు, అప్పారావు, సూరిబాబు, ప్రసాద్, కృష్ణవర్మ, సీతారామరాజు, శివాజిరాజు, చక్రదొర, లక్ష్మణాచారి,మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు శిక్షణ తరగతులు

అనంతగిరి/హుకుంపేట/అడ్డతీగల: మండల కేంద్రాల్లో సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు రిఫ్రెష్ శిక్షణ తరగతులను ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు అనంతగిరి, హుకుంపేట, అడ్డతీగల ఎంపీడీవోలు శ్రీహర్షిత్, వెంకటరావు, బాపన్నదొర చెప్పారు. స్థానిక ఐసీడీఎస్, వెలుగు కార్యాలయాల్లో మూడు కేంద్రాలుగా విభజించి రోజు ఆరు సచివాలయ కేంద్రాలకు గాను ఒక్కొ శిక్షణ కేంద్రంలో 60 మంది చొప్పున రోజు 180 మందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అడ్డతీగలలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

కూలిన చెట్టు.. స్తంభించిన రాకపోకలు

వై.రామవరం: వై.రామవరం నుంచి సరిహద్దు, మండల లోతట్టు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారికి అడ్డుగా శనివారం రాత్రి పెద్ద మామిడి చెట్టు కుప్పకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మొదళ్లు కుల్లడంతో కుప్పకూలిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు స్పందించి యంత్రాల సాయంతో కూలిన చెట్టును తొలగిస్తున్నారు.



రోడ్డుకు అడ్డంగా కూలిన మామిడి చెట్టు

ఘనంగా వనసమారాధన



ఉసిరి చెట్టును అలంకరిస్తున్న విద్యార్థినులు

వై.రామవరం: పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్‌లో శనివారం రాత్రి ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల జానపద నృత్యాలు, గేయ, నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉసిరిచెట్టు కింద విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ దంపతులను ఘనంగా సన్మానించారు.

ఓటరు నమోదుకు 161 దరఖాస్తులు

రాజవొమ్మంగి: ఓటరు నమోదుకు 161 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి తెలిపారు. పోలింగ్ బూత్‌లను నిశితంగా పరిశీలించామన్నారు. మార్పులు జరిగిన ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవెల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో కొత్త పి.ఎస్.నంబర్లను వేశామన్నారు.

పరిసరాల పరిశుభ్రతోనే ఆరోగ్యం

అరకులోయటౌన్: పరిసరాల పరిశుభ్రంతోనే ఆరోగ్యం కలుగుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని కొండ వీధిలో ఆయన ఆదివారం పర్యటించారు. స్థానికులకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూపుకోవాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలుంటే తక్షణమే వైద్య సేవలు పొందాలన్నారు. ప్రతి రోజు వీధుల్లో కాలువల శుభ్రతో పాటు దోమల మందు పిచికారీ చేయించాలని ఈవోకు ఆదేశించారు.మాజీ ఎంపీటీసీ భాస్కరరావు, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శులు వెంకటరావు, గోపాలరావు, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, నాయకులు శెట్టి అప్పాలు, కిరణ్‌కుమార్, సాంబయ్య, గురు, తదితరులు పాల్గొన్నారు.



కొండవీధిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, నాయకులు

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

వీఆర్ పురం: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించే విధంగా తోటి వారు ప్రోత్సహించాలని ఎస్‌ఐ బి.వెంకటేష్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని రాజీవ్ సెంటర్‌లో లక్ష్మీనరసింహ వికలాంగుల యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు వి.రంగారెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బి.సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిషన్ సభ్యుడు బాలు, సుమన్, వికలాంగుల యూనియన్ సభ్యులు హరినాథ్, శ్రీనివాస్, రవి, నాగేశ్వరరావు, శివరావు, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.



మదర్ థెరెస్సా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

విద్యార్థులకు రగ్గుల పంపిణీ

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో సుమారు 90 మంది విద్యార్థులకు చేయూత వారియర్స్ ట్రస్టు ఆధ్వర్యంలో రగ్గులు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు డి.రమణ మాట్లాడుతూ చలి నుంచి విద్యార్థులు రక్షణ పొందేందుకు రగ్గులు అందజేశామని, ఏజెన్సీలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు.ట్రస్ట్ సభ్యులు రాజేష్, లోవరాజు, బిలాస్కర్, జగన్ పంతులు, గోవింద్ పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

మారేడుమిల్లి : సున్నంపాడు పంచాయతీ పరిధిలోని తూర్పురు గ్రామానికి చెందిన వలంటీర్ పల్లాల సోమిరెడ్డి తాటాకిల్లు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు మండల కో-ఆప్షన్ సభ్యుడు జి.ధర్మరాజు, ఎస్ఎస్‌హెచ్ఆర్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఆనంద్, మైనార్టీ సెల్ సభ్యుడు జిలానీ, వార్డు సభ్యుడు సత్తిబాబు తదితరులు పరామర్శించి, వంట సామగ్రి అందజేసి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.



సరకులు ఇస్తున్న దాతలు

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ

జి.మాడుగుల: మండల కేంద్రంలో శనివారం రాత్రి అంబలం పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మైదాన ప్రాంతాల నుంచి వేదపండితులు వచ్చి పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు